

## కేసీఆర్‌ను కలిసిన సతీష్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను మంగళవారం టీఎస్ రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సతీష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

– సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ )

## కందిమళ్లకు ప్రతిభా పురస్కారం



డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావుకు చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 5 : రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్టు సంయుక్తాధ్వర్యంలో నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం చాట్ల శ్రీరాములు 92వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారాన్ని 2023కు గాను రంగస్థల నటుడు, రచయిత, పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావుకు ప్రదానం చేసి సత్కరించారు. పురస్కారం కింద రూ.15వేలు నగదు, శాలువా, జ్ఞాపికను ప్రదానం చేశారు. తెలుగువర్సిటీ వీసీ ఆచార్య టి.కిషన్‌రావు, నాటకరంగ ప్రముఖులు డాక్టర్ డీఎస్ఎన్ మూర్తి, తనికెళ్ళ భరణి, బిఎం రెడ్డి, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్టు కన్వీనర్ ముట్నూరి కామేశ్వరరావు తదితరులు పాల్గొని నాటక రంగానికి చాట్ల శ్రీరాములు చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా యువభేరి థియేటర్ సంస్థ ఆధ్వర్యంలో అక్కల తామేశ్వరయ్య రచించిన బూడిద హాస్య నాటిక వి.సత్యనారాయణ దర్శకత్వంలో వేదికపై పలువురు కళాకారులు ప్రదర్శించారు.

## 17, 18 తేదీల్లో చలో ఢిల్లీ

**ఎస్సీ వర్గీకరణపై కాలయాపన వద్దు : పిడమర్తి రవి**




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి తదితరులు

ఖైరతాబాద్, డిసెంబర్ 5 : కమిటీల పేరుతో ఎస్సీ వర్గీకరణను కాలయాపన చేయవద్దని, ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17, 18 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళిత జనాభాలో 75 శాతం మాదిగలు (50 లక్షలకు పైగా)ఉన్నారని, రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రభుత్వ పదవులు, నామినేటెడ్ పోస్టులు 75 శాతం కేటాయించాలని, ప్రతి జిల్లా యూనిట్‌గా మాదిగలకు పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. వర్గీకరణ ప్రక్రియను తక్షణమే ప్రారంభిస్తామని చెప్పిన ప్రధాని మోదీ ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లును ఆమోదింపచేయాలన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి మాదిగలు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాదిగ రాజకీయ వేదిక అధ్యక్షుడు ఒక్కలగడ్డ చంద్రశేఖర్, గజ్జెల కాంతం, మల్లికార్జున్, నర్సింగ్‌రావు, మొగిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మట్టిని కాపాడితేనే మనుగడ

- దేశ వ్యాప్తంగా సాగులో మార్పు అవసరం
- ఉప కులపతి డా.నీరజా ప్రభాకర్



సదస్సులో పాల్గొన్న కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డా.నీరజా ప్రభాకర్, వక్తలు

వ్యసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 5 : మట్టిని పొల్యూషన్ నుంచి ఎంత కాపాడితే.. ప్రకృతి మనకు అంత సహకరిస్తుందని కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డా.నీరజా ప్రభాకర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ మృత్తిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ఎర్ర, నల్ల రేగడి, ఇసుక నేలలు అధికంగా ఉన్నాయని, వాటి ప్రస్తుత పరిస్థితులపై వ్యవసాయ అనుబంధ శాస్త్రవేత్తలు పరిశోధలు మరింత పెంచాలన్నారు. సారవంతమైన నేల, ప్రకృతితోనే సమాజంలో ప్రతి జీవి మనుగడ ముడిపడి ఉందన్నారు. సారవంతమైన నేలకు తోడు జలవనరులు ఉంటేనే ఆహారం, నీరు, పర్యావరణ భద్రతకు భరోసా ఉంటుందని సూచించారు. గుప్పెడు మట్టిలో వెయ్యికోట్ల సూక్ష్మజీవులు ఉంటాయని, ప్రధానంగా మొక్కల వేర్లు, జీవాల్లోని సేంద్రీయ కర్బనం, భూమిపై పెరిగే అడవులు, సారవంతమైన నేలలు వాతావరణంలోని కర్బనాన్ని స్థిరీకరించి పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న రసాయన సాగు విధానాలు, సేంద్రీయ ఎరువుల లభ్యత తగ్గడం, ఒకేతరహాలో పంటలు పండించడం, సాగు నీటి పద్ధతుల్లో లోపాలు, నేల కోతకు దారి తీస్తున్నాయన్నారు. సాగు భూములు కాలుష్యానికి గురికావడంతో నిస్సారంగా మారుతున్నాయని చెప్పారు. నేల కోతను అరికట్టేందుకు కాంటూరు సేద్యం, అంతర మిశ్రమ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. వర్మి కంపోస్టు, పచ్చిరొట్ట, జీవ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యమైన నేలతోనే ఆహార ఉత్పత్తి పెరుగుతుందని నాగార్జున గ్రూఫ్ చైర్మన్ డా.రాజు అన్నారు. 2050 నాటికి ఆహార ధాన్యాల కొరత లేకుండా ఉండాలంటే దేశంలో పంటల మార్పిడి, కవర్ పంటల సాగు, జీవన ఎరువుల వాడకం పెంచాలన్నారు. సహజ వనరుల వినియోగానికి పరిశ్రమలు, రైతులు సహకరించాలన్నారు. లిబర్టీ ఫౌండేషన్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు అగ్రిఫుడ్ టెక్ సంస్థ యాజమాన్యం డా.రవిశంకర్, కోరమండల్ ఫర్టిలైజర్ సంస్థ ప్రతినిధి జీవీ సుబ్బారెడ్డి, యూనివర్సిటీ డీన్ కిరణ్‌కుమార్, కళాశాల అసోసియేట్ డీన్ డా.ప్రశాంత్, రైతులు నాగరత్నం నాయుడు, పద్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మాధవ రెడ్డి, టీచింగ్ సైదయ్య, లక్ష్మీనారాయణ, సురేశ్ రెడ్డి, నిఖిల్, శ్రీరాములు, టీచింగ్, నాన్ టీచింగ్, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సింథటిక్ కెమిస్ట్రీపై ఐఐసీటీలో అవగాహన సదస్సు

**ఐదు నెలల పాటు జరిగిన సదస్సులో పాల్గొన్న పీజీ విద్యార్థులు**



సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : సింథటిక్ కెమిస్ట్రీపై ఐదు నెలల పాటు సాగిన ఓరియెంటేషన్ సదస్సు ముగిసింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో జరిగిన ఈ సదస్సులో ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతున్న విద్యార్థులకు ఐఐసీటీ సైంటిస్టులు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతున్న విద్యార్థులకు వరుసగా ఐఐసీటీలో అవగాహన కల్పిస్తుండగా.. తాజాగా చేపట్టిన ఓరియెంటేషన్ సదస్సులో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఉండాల్సిన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అడ్వాన్స్ సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ అవసరం, రసాయనిక రంగంలో ఉన్న ప్రాధాన్యత అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాక్సిన్ తయారీలో ఐఐసీటీ ముఖ్య భూమికను పోషించిన నేపథ్యంలో ఇండస్ట్రీ, అకాడమీలను సమన్వయం చేయడంలో భాగంగా ఈ తరహా ఓరియెంటేషన్ సదస్సులను నిర్వహించినట్లుగా ఐఐసీటీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఐఐసీటీ చేపడుతున్న పలు ప్రాజెక్టులకు విస్తృత స్థాయిలో కెమిస్ట్రీ పూర్తి చేసిన మానవ వనరులు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఓరియెంటేషన్ తరగతులతో విద్యార్థులలో ఇండస్ట్రీ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి తోడ్పడుతాయని పేర్కొన్నారు.

## జనవరి 1 నుంచి పారిశ్రామిక ప్రదర్శన

**అనుమతులు పొందిన తర్వాత ప్రత్యేక ఏర్పాట్లు**

**46 రోజుల పాటు స్టాళ్ల నిర్వహణ**



అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో సందర్శకులు (ఫైల్)

అబిడ్స్, డిసెంబర్ 5 : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జనవరి ఒకటి నుంచి అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను నిర్వహించేందుకు గాను ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు కసరత్తు ప్రారంభించారు. ప్రతి సంవత్సరం జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు 46 రోజుల పాటు ప్రదర్శనను నిర్వహిస్తూ వస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల ఉత్పత్తులను ప్రదర్శనలో ప్రదర్శించడంతో పాటు విక్రయాలు చేపడుతారు. ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు తమ శాఖ ప్రగతిని స్టాళ్ల ద్వారా ప్రజలకు వివరించేందుకు ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేస్తాయి. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా కొనసాగుతున్న విద్యా సంస్థల ద్వారా విద్యా వ్యాప్తికి పాటు పడుతున్నాయి. ప్రదర్శన ద్వారా వచ్చే ఆదాయాన్ని విద్యా సంస్థల నిర్వహణకు వినియోగిస్తున్నాయి. కాగా 2024లో పారిశ్రామిక ప్రదర్శనను నిర్వహించేందుకు గాను సొసైటీ ప్రతినిధులు ముందుకు వచ్చారు. ఇప్పటికే దరఖాస్తుల ఆహ్వానం, టెండర్ల ద్వారా ప్రధాన స్టాళ్ల కేటాయింపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, సెక్రటరి బి.హనుమంతరావు, జాయింట్ సెక్రటరి చంద్రజిత్ సింగ్, కోశాధికారి ఈ. రాజేందర్ కుమార్ పర్యవేక్షణలో ఈ సంవత్సరం అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించేందుకు గాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పలు విభాగాలకు చెందిన కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేశారు. మైదానంలో రెండు వేల వరకు స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. మినీ ట్రైన్‌కు మరమ్మతులు చేపట్టనున్నారు.

### ప్రతి సంవత్సరం 20 లక్షల వరకు సందర్శకులు..

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రతి సంవత్సరం 46 రోజుల పాటు నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు ప్రతి సంవత్సరం 20 లక్షల వరకు సందర్శకులు వస్తారని నిర్వాహకులు అన్నారు. గతేడాది భారీగా 20 లక్షలపై చిలుకు సందర్శకులు సందర్శించినట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సంవత్సరం విషయమై ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకుని ప్రదర్శనను పకడ్బందీగా నిర్వహిస్తే గతం కంటే ఎక్కువ మంది సందర్శకులు తరలి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.




నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని ఎగ్జిబిషన్ సొసైటీ కార్యాలయం